# జాబ్ మేళా అద్భుత విజయం

# విద్యార్థులకు ఉద్యోగాల వరద

**రాష్ట్రవ్యాప్తంగా 1,200 మందికి పైగా వృత్తి విద్యార్థులు పాల్గొనగా 250 మంది వివిధ కంపెనీల్లో ఎంపిక**

**రూ.15,000 నుండి రూ.27,000 వరకు వేతన ప్యాకేజీలతో ఉద్యోగ ఆఫర్లు**







**హనుమకొండ బ్యూరో /సెప్టెంబర్ 2( జర్నలిస్ట్ వార్త):** సమగ్ర శిక్ష %-% వృత్తి విద్య విభాగం ఆధ్వర్యంలో ఎస్పీడీ నవీన్ నికోలస్ పర్యవేక్షణలో మేడ్చల్ జిల్లా, హైదరాబాద్‌లోని జడ్‌పీహెచ్‌ఎస్ ఉప్పల్ కలాన్ పాఠశాలలో నిర్వహించిన జాబ్ మేళా ఘనవిజయాన్ని సాధించింది. 2015%-%16 విద్యా సంవత్సరంనుంచి రాష్ట్రంలోని 409 ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్య విజయవంతంగా అమలవుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు దిశగా అడుగులు వేస్తోంది. ఈ జాబ్ మేళాకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ట్రేడ్లలో శిక్షణ పొందిన 1,200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 35 ప్రసిద్ధ కంపెనీలు ఉద్యోగ అవకాశాలను అందించగా, 250 మందికి పైగా విద్యార్థులు వివిధ రంగాల్లో ఎంపికయ్యారు. వారిలో 120 మంది నెలకు రూ.15,000 నుండి రూ.27,000 వరకు వేతన ప్యాకేజీలతో ఉద్యోగ ఆఫర్లు పొందారు. ఈ కార్యక్రమానికి ఎస్పీడీ రాధా రెడ్డి, జేడీ వెంకటనర్సమ్మ, రాష్ట్ర వృత్తి విద్య సమన్వయకర్త నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై, విద్యార్థులను ప్రోత్సహించారు. ఎంపికైన వారికి స్వయంగా ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ మేళాలో ఎన్‌ఈఎక్స్‌టీఏ, జియో, జెప్టో, టాటా వెస్ట్‌సైడ్, యోస్టా రిలయన్స్, విజన్ ఇండియా, టాటా స్టైవ్, కేఎఫ్‌సీ, క్రీమ్ స్టోన్, రామోజీ ఫిల్మ్ సిటీ, హోటల్ పర్ణిక, మెడ్ ప్లస్, జస్ట్ డయల్, డిజీ ట్రైడ్ తదితర ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ఈ విజయవంతమైన కార్యక్రమానికి ఆర్జేడీ, డీఈఓ, ఏఎంఓ, ఎంఈఓ తదితర అధికారులు కీలక పాత్ర పోషించారని నిర్వాహకులు తెలిపారు. పోలీస్ శాఖ, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, మీడియా ప్రతినిధుల సహకారానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జడ్‌పీహెచ్‌ఎస్ ఉప్పల్ కలాన్ ప్రిన్సిపాల్ శిరీష, పాఠశాల సిబ్బంది, వృత్తి సమన్వయకర్తలు, శిక్షకుల సహకారంతో జాబ్ మేళా సాఫల్యవంతంగా నిర్వహించగలిగామని నిర్వాహకులు పేర్కొన్నారు.